నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
3 | కరీంనగర్, గురువారం 28 నవంబర్ 2024 | RAJANNA SIRCILLA

# ఉద్యమ స్ఫూర్తిని చాటుదాం

గంగాధర, నవంబర్ 27: కరీంనగర్‌లో ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌కు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని, ఉద్యమ స్ఫూర్తిని చాటాలని బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ నెల 29న దీక్షా దివస్ సందర్భంగా గంగాధర మండలం బూరుగుపల్లిలో బుధవారం చొప్పదండి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా, ఆయన దిశానిర్దేశం చేశారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షకు నాడు కేంద్రం దిగొచ్చి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందని గుర్తు చేశారు. ఆనాడు వలస పాలకుల వివక్షపై స్వరాష్ట్రం కోసం పోరాటం చేశామని, ఇప్పుడు మరో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలన చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ నామస్మరణ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వ ఏ మీటింగ్ కూడా జరగడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి సభలో కేసీఆర్ స్మరణ చేయడం తప్ప ఆరు గ్యారంటీలు, పథకాల అమలు గురించి మాట్లాడింది లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏ ఒక్క వర్గానికీ లాభం జరగలేదని, రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు భరోసాకు మంగళం పాడారని, 4 వేల పెన్షన్‌కు అతీగతి లేదని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం రాలేదని మండిపడ్డారు.

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

# దీక్షా దివస్‌కు తరలిరండి

- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- అల్గునూర్‌లో ఏర్పాట్ల పరిశీలన



అల్గునూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రసమయి, జీవీఆర్

కార్పొరేషన్/ తిమ్మాపూర్, నవంబర్ 27: మేధావులు, ఉద్యమకారులు, కార్యకర్తలతో కలిసి ఈ నెల 29న అల్గునూరులో దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నామని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తారని చెప్పారు. జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం అల్గునూర్‌లోని వరంగల్ రోడ్‌లో దీక్షా దివస్ సభా స్థలిని మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మేయర్ సునీల్ రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడారు. ఆనాడు ఆమరణ దీక్షను అడ్డుకునేందుకు పోలీసులు కుటిల ప్రయత్నాలు చేశారని, అల్గునూర్ చౌరస్తాలో అరెస్ట్ చేసి ఖమ్మం తరలించినప్పటికీ కేసీఆర్ వెనక్కి పోకుండా ఆమరణ దీక్ష చేపట్టారని కొనియాడారు. దాని ఫలితంగానే నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి తెలంగాణను ఇచ్చిందని గుర్తు చేశారు. దీక్షా దివస్ రాజకీయ కార్యక్రమం కాదని, తెలంగాణ రావడానికి కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు అల్గునూరు చౌరస్తా నుంచి సభాస్థలి వరకు ర్యాలీ తీసి, కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కేసీఆర్ పేరు లేకుండా చేస్తామని కొందరు కూతలు కూస్తున్నారని, అది రాసిపెట్టిన బోర్డు కాదని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండే పేరని స్పష్టం చేశారు.

# కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ

- 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు
- జగిత్యాల బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల టౌన్, నవంబర్ 27: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన పోరాటంతోనే తెలంగాణ కల సాకారమైందని, ఆ ఉద్యమం భావితరాలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ప్రశంసించారు. కేసీఆర్ తెలంగాణ కోసం ఎంతో తపించారని, జాతీయ స్థాయి నాయకులను ఒప్పించి రాష్ట్రాన్ని సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఈ నెల 29న దీక్షా దివస్ సందర్భంగా బుధవారం జగిత్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం జగిత్యాల బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ సలీం బాధ్యతలు వహిస్తారని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాల్టీల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జగిత్యాల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, అవారి శివకేసరిబాబు, దారిశెట్టి రాజేశ్, అయ్యోరి రాజేశ్, నరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు అమీన్‌బాయ్, వొల్లెం మల్లేశం, చేని తిరుపతి పాల్గొన్నారు.

### చరిత్రను మరిచిపోవద్దు

అనేక ఉద్యమాల ద్వారా తెలంగాణ సాధించుకున్నాం. ఉద్యమం నుంచి రాజకీయ పార్టీగా మారిన తర్వాత ఆనాడు చేసిన పోరాటం గురించి మర్చిపోతున్నాం. మనం చరిత్రను ఎప్పుడు మర్చిపోతామో..? అప్పుడే మనల్ని ప్రజలు కూడా మర్చిపోతారు. తెలంగాణ తొలి సీఎంగా కేసీఆర్ పదేండ్లలో చేసిన అభివృద్ధితోపాటు పద్నాలుగేండ్లు తెలంగాణ సాధన కోసం చేసిన ఉద్యమం గురించి అందరం చెప్పుకోవాలి.

\- కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే





# 48,440 దరఖాస్తులు రిజెక్ట్

## పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కలిపి 12.53 శాతం తిరస్కరణ





- ముసాయిదా జాబితా విడుదలతో వెలుగులోకి
- రిజెక్టు అయిన వారితోపాటు కొత్తగా నమోదు చేసుకునే వారికి మళ్లీ అవకాశం
- మార్పులు.. చేర్పులు చేసుకునే చాన్స్
- మరింత మందిని ఓటర్లుగా చేర్చే ప్రయత్నాల్లో ఔత్సాహిక అభ్యర్థులు
- దరఖాస్తుదారులు మేలుకోకపోతే ఓటు కోల్పోయే ప్రమాదం

కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి వచ్చిన ఓటర్ నమోదు దరఖాస్తుల్లో భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఒకటి రెండు కాదు, ఏకంగా 48,440 అప్లికేషన్స్ వివిధ కారణాలతో రిజెక్ట్ అయ్యాయి. అందులో టీచర్లకు సంబంధించి 15.63 శాతం గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి 12.28 శాతం ఉండగా, ఈ రెండు కలిపి చూస్తే 12.53 శాతం దరఖాస్తులు ఉన్నాయి. తాజాగా వెల్లడించిన ముసాయిదా జాబితాతో ఈ విషయాలు వెలుగుచూడగా.. ఓటు హక్కు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశమిచ్చింది. రిజెక్టు అయిన వారితోపాటు కొత్తగా నమోదు చేసుకునే వారు, అలాగే మార్పులు చేర్పులు చేసుకునే వారు సైతం వచ్చే నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించింది. మరింత మంది ఓటర్లను చేర్చేందుకు ఔత్సాహిక అభ్యర్థులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, దరఖాస్తుదారులు మేల్కోకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదమున్నది.

కరీంనగర్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల పదవీకాలం వచ్చే మార్చితో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎలక్షన్లకు సిద్ధమైన ఎన్నికల సంఘం, ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి ఓటర్ నమోదుకు అవకాశమిచ్చింది. మొదటి విడుతలో సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6వరకు ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దాంతో ఈ సారి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం భారీగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నవంబర్ 6 నాటికి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 3,58,579 దరఖాస్తులు రాగా, అధికారులు ప్రతి దరఖాస్తునూ నిశితంగా పరిశీలించారు. అందులో 44,048 దరఖాస్తుల(12.28 శాతం)ను వివిధ కారణాలతో తిరస్కరించారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి నవంబర్ 6 నాటికి మొత్తం దరఖాస్తులు 27,994 రాగా, పట్టభద్రుల మాదిరిగానే వడబోశారు. ఆ మేరకు 4,392 దరఖాస్తుల (15.68శాతం)ను రిజెక్ట్ చేశారు. మొదటి విడుతలో భాగంగా మొత్తం 3,86,573 మంది పట్టభద్రులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా, అందులో మొత్తం 48,440 దరఖాస్తులు(12.53) శాతం తిరస్కరించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఓటర్ ముసాయిదా జాబితాను ఈ నెల 23న విడుదల చేశారు. దీంతో వేల సంఖ్య లో దరఖాస్తులు రిజెక్టు అయిన విషయం వెలుగులోకి వచ్చింది.

### ఈ నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాల వారీగా పట్టభద్రుల వివరాలు

| జిల్లా | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 3,709 | 1,524 | 5,233 |
| మంచిర్యాల | 17,414 | 10,699 | 28,113 |
| ఆదిలాబాద్ | 9,308 | 4,097 | 13,405 |
| నిర్మల్ | 10,689 | 5,258 | 15,947 |
| నిజామాబాద్ | 17,237 | 9,873 | 27,110 |
| కామారెడ్డి | 9,961 | 4,032 | 13,993 |
| జగిత్యాల | 19,659 | 12,163 | 31,822 |
| పెద్దపల్లి | 16,771 | 10,558 | 27,330 |
| కరీంనగర్ | 38,720 | 25,934 | 64,654 |
| రాజన్న సిరిసిల్ల | 12,554 | 7,720 | 20,274 |
| సంగారెడ్డి | 13,670 | 6,331 | 20,001 |
| మెదక్ | 7,945 | 3,086 | 11,031 |
| సిద్దిపేట | 19,618 | 9,826 | 29,444 |
| హనుమకొండ | 2,757 | 1,221 | 3,978 |
| భూపాలపల్లి | 1,541 | 655 | 2,196 |
| మొత్తం | 2,01,553 | 1,12,977 | 3,14,531 |

### మళ్లీ నమోదుకు అవకాశం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం రెండో సారి అవకాశమిచ్చింది. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 9వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. రిజెక్టు అయిన వారితోపాటు కొత్త వారు కూడా నమోదు చేసుకోవచ్చు. అలాగే దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చు. డిసెంబర్9 తర్వాత మళ్లీ అవకాశం ఉంటుందా.. లేదా..? అన్న విషయంలో స్పష్టత లేదు. కానీ, వచ్చే నెల 9వరకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి, తుది జాబితాను 30న విడుదల చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఓటు హక్కు కోసం దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అదే స్థాయిలో రిజెక్ట్ కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రులు విషయాన్ని పక్కన పెడితే.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి వచ్చిన అప్లికేషన్స్‌లో 15.68 శాతం తిరస్కరించడంపై సదరు వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఉపాధ్యాయుల్లోనూ బల్క్ నమోదు వల్లే ఈ పరిణామం తలెత్తి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పెంచేందుకు ప్రయత్నాలు

ఎమ్మెల్సీ సీటుపై జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతున్న కొంత మంది నాయకులు, జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది నాయకులు మొదటి విడుత నమోదులోనే వీలైనంత ఎక్కువగా మందిని ఓటర్లుగా చేర్చడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. కొందరైతే ఏ కంగా ఆపరేటర్లను పెట్టి నమోదు చేయించారు. మిస్డ్ కాల్ ఇస్తే చాలు.. సంబంధిత ఓటర్ పూర్తి వివరాలు తెలుసుకొని మరీ ఎంట్రీ చేశారు. ఈ నేపథ్యంలో భారీగా దరఖాస్తులు రిజెక్టు కావడంతో సదరు అభ్యర్థులు మళ్లీ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. బల్క్‌గా నమోదు చేసినప్పుడు దొర్లిన తప్పులు, వాటి ద్వారా రిజెక్టు అయిన దరఖాస్తుదారుల వివరాలు సరిచూసుకుంటూ మళ్లీ ఓటరుగా నమోదు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో మొదటిదఫా నమోదు చేసుకోని కొత్త వారిని గుర్తించి, వారి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. అంటే క్షేత్రస్థాయిలో ఓటర్ నమోదు కోసం జరుగుతున్న ప్రయత్నాలు చూస్తే మరో 50 వేల వరకు అప్లికేషన్స్ వచ్చే అవకాశాలున్నాయని అధికారవర్గాల ద్వారా తెలుస్తున్నది. కాగా, మొదటి విడుత దరఖాస్తున్న వారు ముసాయిదా జాబితాను ఒకసారి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అందులో పేరు లేకపోతే తిరిగి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో దరఖాస్తు చేసుకున్నాం కదా! అని కూర్చుంటే.. ఓటు కోల్పోయే ప్రమాదమున్నది. దరఖాస్తుదారుడు జాబితా చూసుకున్నప్పుడే పేరు ఉన్నదా.. లేదా..? అనే విషయం తెలుస్తుంది. అంతే కాదు, పరిశీలనలో ఏమైనా పొరపాట్లు ఉంటే కూడా ఫిర్యాదు చేసే అవకాశముంటుంది.

### ఈ నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాల వారీగా ఉపాధ్యాయుల వివరాలు

| జిల్లా | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 283 | 131 | 419 |
| మంచిర్యాల | 863 | 542 | 1,405 |
| ఆదిలాబాద్ | 975 | 426 | 1,401 |
| నిర్మల్ | 1,147 | 539 | 1,686 |
| నిజామాబాద్ | 1,947 | 1,252 | 3,199 |
| కామారెడ్డి | 1,280 | 695 | 1,975 |
| జగిత్యాల | 1,146 | 449 | 1,595 |
| పెద్దపల్లి | 447 | 310 | 757 |
| కరీంనగర్ | 2,288 | 1,340 | 3,628 |
| రాజన్న సిరిసిల్ల | 587 | 231 | 818 |
| సంగారెడ్డి | 1,421 | 1,075 | 2,496 |
| మెదక్ | 709 | 393 | 1,102 |
| సిద్దిపేట | 1,839 | 1,062 | 2,901 |
| హనుమకొండ | 107 | 33 | 140 |
| భూపాలపల్లి | 62 | 18 | 80 |
| మొత్తం | 15,106 | 8,496 | 23,602 |



చలి మంటకాగుతున్న చిన్నారులు

# గజ.. గజ

- వారం నుంచి పెరుగుతున్న చలి తీవ్రత
- 14 డిగ్రీలకు పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వచ్చే నెలలో మరింత వణుకే
- ఉన్ని వస్తువులకు పెరుగుతున్న గిరాకీ
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

చలి తీవ్రమవుతున్నది. మునుపెన్నడూ లేని విధంగా భయపెడుతున్నది. డిసెంబర్, జనవరిలో నమోదయ్యే రాత్రి ఉష్ణోగ్రతలు ఈ నెలలోనే నమోదవుతున్నాయి. ఈ నెల 20వ తేదీ నుంచి 14 డిగ్రీలకు పడిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ పొగమంచు కమ్ముకుంటున్నది. వారం నుంచి పొద్దంతా చలి తీవ్రత ఒకేలా ఉంటుండగా, ప్రజానీకం ఇబ్బంది పడుతున్నది.

కరీంనగర్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : చలి విపరీతంగా పెరుగుతున్నది. గతేడాది కంటే ఎక్కువ ప్రభావం చూపుతున్నది. గతేడాది ఇదే నెలలో రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 21 డిగ్రీలు నమోదయ్యాయి. కానీ, ఈ యేడాది మాత్రం 18 నుంచి 14 డిగ్రీలకు పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితి గతంలో డిసెంబర్, జనవరిలో కనిపించేది. ప్రస్తుతం నెల ముందుగానే తీవ్రత పెరిగింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీస్తున్న చలి గాలుల తీవ్రత కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామీణ ప్రాంతాల్లో పొగ మంచు కమ్ముకుంటున్నది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు పొగమంచు కనిపిస్తున్నది. ఈ నెల 15 వరకు రాత్రి వేళ 20 నుంచి 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనా, 16న ఒక్కసారిగా 18 డిగ్రీలకు పడిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే స్థితిలో నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 31 నుంచి 28కి పడిపోయాయి. అంతే కాకుండా గాలిలో తేమ శాతం 37కు పెరిగింది. దీనికితోడు గంటకు 7 కిలోమీటర్ల చొప్పున చలి గాలులు వీస్తుండగా, చలి తీవ్రత కనిపిస్తున్నది.

### గుండెపోట్లు పెరిగే ముప్పు

సాధారణంగా చలికాలంలో గుండె సంబంధిత వ్యాధులు అధికంగా వస్తాయి. ఎక్కువగా గుండెపోట్లు కనిపిస్తుంటాయి. ఈ సీజన్‌లో చాలా మంది పని తగ్గించడం వలన స్ట్రోక్, హార్ట్ ఫెల్యూర్, కార్డియోవాస్క్యులర్ ఇబ్బందులు, ఎరిథిమిమో వంటి సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గుండెను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. చలికాలం శరీరాన్ని సాధ్యమైనంత వరకు వేడిగా ఉంచుకోవాలని, గుండెను పదిలంగా ఉండేందుకు ఇది మంచి పద్ధతని, ఫిజికల్ ఆక్టివిటీస్ ఎక్కువగా ఉంటే మధ్య మధ్యలో బ్రేక్ తీసుకోవాలని, నీళ్లు ఎక్కువగా తాగాలని, దీంతో శరీరం హైడ్రేట్‌గా ఉంటుందని చెబుతున్నారు. చలికాలం జాగ్రత్తగా ఉండాలని, అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించాలని, గుండె పరీక్షలు చేయించుకోవాలని, గుండె సంబంధిత వ్యాధులున్న వారు చలికి తిరగవద్దని సూచిస్తున్నారు.

### చిన్న పిల్లలు.. వృద్ధులు జాగ్రత్త

చలి ప్రభావం ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులపై ప్రభావం చూపుతుంది. వీరు దగ్గు, శ్వాస కోశ వ్యాధుల బారిన పడే ముప్పు ఉంటుంది. అందుకే చాలా జాగ్రత్తగా ఉండాలి. చలిలో తిరగవద్దు. ఉన్ని దుస్తులు ధరించాలి. కాచి వడబోసిన నీళ్లు తాగాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులు దుమ్ము, ధూళి ప్రాంతాల్లో తిరగకూడదు. సమతుల ఆహారం తీసుకోవాలని. చలి కారణంగా రోగ నిరోధక శక్తి తగ్గి సీజనల్, ఇతర వ్యాధుల బారిన పడే ముప్పు ఉన్నందున విటమిన్లు, ఖనిజాలు లభించే ఆహారాన్ని భోజనంలో ప్రతి రోజు తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. మాంసాహారాన్ని కాకుండా పండ్లు, కూరగాయలు, దుంపలు ఎక్కువగా ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తిని పెంచుతుందని సూచిస్తున్నారు.


### ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

కరీంనగర్: ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న నగరవాసులు



చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమ్మకాలు సాగుతున్నాయి. అస్సాం, నేపాల్, మిజోరాం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులకు ఈ సారి పంట పండుతున్నది. దుప్పట్లు, జర్సీలు ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు. ఉన్ని దుస్తులకు అమాంతం ధరలు పెంచినా కొనక తప్పడం లేదని జనం వాపోతున్నారు. ముఖ్యంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్, అమరుల స్తూపం వద్ద, జ్యోతినగర్, శాతవాహన యూనివర్సిటీ రోడ్, ఫారెస్ట్ ఆఫీస్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన ఉన్ని మార్కెట్‌లో జనం పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. పిల్లలకు, తమకు అవసరమైన దుస్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. హైవేల వెంట, నగర శివార్లలో కూడా ఈ సారి ఉన్ని దుస్తులు అమ్ముతున్నారు.

# ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలి






మాట్లాడుతున్న పవర్‌లూం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 27: పాలిస్టర్ పవర్‌లూం కార్మికులకు యజమానులు ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని బీవైనగర్‌లోని కార్మిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిస్టర్ యజమానులు అగ్రిమెంట్ ప్రకారం 10 పీకులకు 25 పైసలు చెల్లించకుండా మాంద్యం పేరుతో 22 పైసలు ఇస్తున్నారని మండిపడ్డారు. కూలి తగ్గించి ఇవ్వడం వల్ల కార్మికులు రోజుకు ₹వంద చొప్పున నెలకు ₹2500 వరకు కోల్పోతారని ఆవేదన చెందారు. పెరిగిన ధరలతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా కూలీ తగ్గిస్తే ఏవిధంగా బతుకుతారని ప్రశ్నించారు. ఈ ఆదివారం వేతనాలు ఒప్పందం ప్రకారం చెల్లించాలని, లేకుంటే కార్మికులతో కలిసి సోమవారం పాలిస్టర్ అసోసియేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు అమలవుతున్న అగ్రిమెంట్ మేతో ముగిసిందని, కొత్తగా కూలీ పెంచాల్సింది పోయి తగ్గించి శ్రమదోపిడీ చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో పవర్‌లూం వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండు రమేశ్, సహాయ కార్యదర్శి బెజిగాం సురేశ్, బింగి సంపత్, లక్ష్మణ్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ నాయకుల కన్నెర్ర

కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు





కమాన్‌చౌరస్తా, నవంబర్ 27: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు కన్నెర్రజేశారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని బుధవారంకరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దుప్పట్లు కప్పుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ చలి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నా విద్యార్థులకు కనీసం దుప్పట్లు పంపిణీ చేయకపోవడం దారుణమని, చలికి వణికిపోతున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో కనీసం దోమతెరలు లేక విద్యార్థులు విష జ్వరాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో రోజుల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు ముట్టడిస్తామని తేల్చిచెప్పారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, నాయకులు వినయ్, సాగర్, ఇషాక్, భోగేశ్వర్, నాగుల శ్రీజ, రత్నం, సురేశ్, సందేశ్, రాకేశ్, గట్టు ఆకాశ్ పాల్గొన్నారు.